# ఎవరికి వారే ఈలోకం

## -నందం రామారావు

**ఏకాంబరం అందగాడు-కాదు**
**ఏకాంబరం ధనవంతుడు-కాదు**
**ఏకాంబరం రౌడీ-కాదు**
**ఏకాంబరంకుటుంబం పెద్దది-కాదు**
**ఏకాంబరం ఒంటరివాడు-అవును**

★★★

ఏకాంబరం ఓ చిన్న పల్లెలో ఓ చిన్న బడ్డీకొట్టు పెట్టుకుని బతుకుతున్నాడు. ఆ పల్లెలో మూడొందల కుటుంబాలకు మించి వుండదు. రైలు, బస్సు సౌకర్యాలు లేవు. బస్సు దిగి నాలుగు కిలోమీటర్లు నడిచి వస్తే 'తూర్పు పాలెం' వస్తుంది.

రాత్రి టైమయిందో తెలీదు. సాధారణంగా పల్లెలో పెందరాడే భోజనాలు చేసి పడుకుంటారు. ఏకాంబరం బడ్డీకొట్టు కట్టేసి పడుకోవాలని అన్నీ సర్దసాగాడు. సరిగ్గా అప్పుడే నర్సయ్య వచ్చాడు.

''ఏకాంబరం! ప్రొద్దుట నుంచి ఒకటే కడుపునొప్పి ఏదైనా టాబ్లెట్ వుంటే ఇవ్వు!'' అన్నాడు.

ఏకాంబరం గాజు దీపాన్ని పెద్దది చేసి ఓ పెట్టెలోంచి టాబ్లెట్ తీసి ఇస్తూ-

''ప్రొద్దుట నుంచీ ఏం చేస్తున్నావ్?'' అన్నాడు.

''అదే పోతుందనుకున్నాను. తగ్గలేదు.''

నర్సయ్య టాబ్లెట్ అందుకుని ''ఎంతివ్వను'' అన్నాడు.

''నలభై పైసలివ్వు''

నర్సయ్య జేబులోంచి రూపాయి తీసి ''చిల్లర తర్వాత తీసుకుంటాను'' అంటూ ఏకాంబరం చేతిలో రూపాయి పెట్టి చక చకా వెళ్ళిపోయాడు.

ఏకాంబరం తన పని ముగించుకుని ఆరుబయట పడుకున్నాడు.

చీకటి పడుతోంది.

గుడ్డిగా వెలుతురు వుంది.

ఆకులు కదలడం లేదు.

పడుకున్న ఏకాంబరంకు నిద్రరావడం లేదు!

ఇవాళెందుకో తన జీవితంలో జరిగిన సంఘటనలన్నీ ఒక్కొక్కటే గుర్తుకొస్తున్నాయి.

ప్రతి మనిషీ తన జీవితం వున్నతంగా వుండాలని కోరుకుంటాడు. తన తల్లి తనను గురించి అలాగే అనుకున్నది. డాక్టర్ చదివించాలని, పేదలకు సహాయం చేయాలని ఆశించింది. 'ఆశ'లన్నీ నెరవేరితే దేవుడెందుకు?

పదో తరగతి చదువుతుండగా చిన్నపాటి జ్వరంతో తల్లి నాలుగోరోజు కల్లా కళ్ళు మూసుకుంది. తండ్రి ఎలా వుంటాడో తెలీదు. తన చిన్న నాడే చనిపోయాడు. తల్లి అష్టకష్టాలు పడి పోషించుకుంటూ వస్తూ చదివించసాగింది.

ఇప్పుడు తల్లి కూడా లేదు.

చుట్టూ జనం వున్నా ఒంటరిగా వుండిపోయాడు! ఎవరూ సహాయం చేయరు. పలుకరించరు. పలకరింపు కోసం పలవరించిన తను పట్టెడన్నం కోసం చదువు మానవలసి వచ్చింది.

బ్రతుకు తెరువు కోసం నిజాయితీగా ఏవేవో పనులు చేశాడు. ఒక్కటీ తనకు తృప్తినివ్వలేదు.

ఒకరోజతను 'తూర్పుపాలెం' చేరుకున్నాడు.

ఈ ఊరు తనకెంతో నచ్చింది.

అమ్మకడుపులా ఆదరించింది.

ఇక్కడందరూ కష్టపడతారు.

రాజకీయాలు లేవు. కక్షలు..

కార్పణ్యాలు లేవు. వున్నదల్లా మంచి తనమే.

ఆ మంచితనమే తనకింత 'నీడ' నిచ్చింది.

'తూర్పుపాలెం' లో ఏ సౌకర్యం, సదుపాయం లేకపోవడమే బాధ కలిగించింది.

ఒక డాక్టర్ లేడు. మందులు లేవు. కనీసం 'తలనొప్పి' వస్తే తగ్గడానికి టాబ్లెట్ ఇచ్చే చిన్నపాటి ఆర్.ఎమ్.పి. డాక్టర్ కూడా లేడు. కనీసం చిన్న చిన్న రోగాలకైనా 'మందులిచ్చి' ఆదుకోవాలన్న ఆలోచనతో ఏకాంబరం పట్నం వెళ్ళి తలనొప్పికి, విరోచనాలకు, వాంతులు, జ్వరం ఇలాంటివి తగ్గడానికి ఏ ఏ మందులు ఎలా వాడాలో తెలుసుకుని, కొని తీసుకొచ్చి బడ్డీలో పెట్టి అమ్మసాగాడు.

తన తల్లి కలలుగన్నట్లు డాక్టర్ కాలేక పోయినా, డాక్టర్లా ఆ పల్లె ప్రజలకు మందులిస్తున్నాడు.

అంతకంటే ఇంకేం కావాలి?

ఒకరోజు ఏకాంబరం బడ్డీ తీయకపోతే విలవిల్లాడిపోయే వారు ఆ పల్లెజనం.

టైమెంతయిందో తెలీదు.

కళ్ళు మూసుకున్నా నిద్ర రావడం లేదు.

ఆలోచనలు రాకుండానూ వుండడం లేదు.

కుక్కొకటి కుయ్యో కుయ్యో మంటు అరుస్తోంది.

ఏదో పేరు తెలీని పిట్ట వికృతంగా అరుచుకుంటు పోతోంటి. గాలి కొద్దిగా వీస్తోంది. ఏకాంబర పక్కమీద అటు ఇటూ దొర్లాడు. ఆ చీకట్లో ఎవరి అడుగుల చప్పుడు. ఏకాంబరం కళ్ళు విప్పి చూశాడు కొద్దిదూరంలో ఎవరో నడిచి వస్తున్నారు. దగ్గరగా వ ''ఏకాంబరం'' అన్నాడు.

గొంతుని బట్టి ఆ వచ్చినాయన ఎవరో గుర్తుపట్టి ఏకాంబరం-

''ఏంటి రాములు ఇప్పుడొచ్చావ్?'' అ అడిగాడు.

''మా నాయనకు ఒకటే జొరం వొణికిపోతున్నాడు.''

ఏకాంబరం ధబాల్ని లేచి లైటు వెలిగించి రేకు పె తీశాడు.

ఆ రేకు పెట్టమీద 'జ్వరానికి, చలికి, వళ నొప్పులకు' అని రాసి వుంది.

అతను మూత తీసి దాన్లోంచి రెండు రకా టాబ్లెట్స్ తీసి రాముల కిచ్చి ''వెంటనే నీళ్ళతో వెయ్ తగ్గిపోతుంది.'' అన్నాడు.

''డబ్బులు ఎంతివ్వమంటావ్?''

''ఇప్పుడేం వొద్దు. రేపు ప్రొద్దుటే వచ్చి ఎ వుందో చెప్పు.''

రాములు తలూపి వెళ్ళిపోయాడు.

ఏకాంబరం దీపం ఆర్పేసి వచ్చి పడుకున్నాడ కళ్ళు మూసుకున్నాడు. అయినా అతనికి నిద్రరావడ లేదు!

★★★

తెల్లారింది.

ఎవరి పనుల్లో వారు మునిగిపోయారు.

తూర్పుపాలెంకు పేపరురాదు.

ఏకాంబరం బడ్డీలో కూర్చుని రేడియో 'వార్తల వింటున్నాడు. అంతలో నర్సయ్య వచ్చి ''ఏకాంబర నీ చేతిలో ఏముందోగానీ టాబ్లెట్ వేసుకోగా కడుపునొప్పి ఇట్టే తగ్గిపోయింది. మా మంచి మంద ఇచ్చావయ్యా'' అన్నాడు.

ఏకాంబరం నవ్వి వూరుకున్నాడు.

''ఈ పల్లెటూళ్ళో నువ్వు గనుక మందుల తీసుకొచ్చి అమ్మకపోతే వూళ్ళో రోగాలత చచ్చిపోతారయ్యా'' అంటూ నర్సయ మెచ్చుకున్నాడు.

పొగడ్తగిట్టని ఏకాంబరం విననట్ల వూరుకున్నాడు. నర్సయ్య బీడీకట్ట కొనుక్కుని వెళ్ళి పోయాడు. వార్తలు అయిపోయాయి. మధ్యాహ్న పట్నం వెళ్లి సరుకులు తీసుకురా వాలనుకుంటున్నాడ ఏకాంబరం. మందులు కూడా కొన్ని అయిపోయాయి. ఏవేవేం కావాల్ రాసుకుంటున్నాడు.

ఆ సమయంలో రాములు అక్కడకొచ్చి ''ఇదిగో ఏకాంబరం! మా నాయనకు జ్వరం కొంచెం తగ్గింది. మళ్ళీ ఏమైనా ఇస్తావా?'' అన్నాడు.

''రాత్రిచ్చిన టాబ్లెట్ వుంది గద. అదిప్పుడెయ్ చాలు.'' అన్నాడు.

రాములు అలాగే అన్నట్లు తలూపి, జేబులోంచి ఐదు రూపాయల నోటు తీసి ''ఇదిగో ఇదుంచు'' అంటూ చెగోడీల సీసామీద ఐదు రూపాయల నోటు పెట్టి గబగబా వెళ్ళిపోయాడు.



ఏకాంబరం పిలుస్తున్నా వినిపించుకోకుండా రాములు వెళ్ళిపోయాడు. అతను నిట్టూర్చి మళ్ళీ సరుకుల లిస్టు రాసు కోవటంలో మునిగిపోయాడు. పది నిమిషాలు గడిచిందో లేదో ఆ బడ్డీ దగ్గర ఓ జీపు వచ్చి ఆగింది. ఆ జీపులోంచి ఓ భారీ కాయం దిగింది.

అప్పుడే ఏకాంబరం దగ్గరకు ఓ ముసలామె వచ్చి ''చూడునాయనా రాత్రి నుంచి నా మనవరాలు ఒకటే ఏడుపు. పాలు కూడా తాగడం లేదు. ఏదైనా మందిచ్చి పుణ్యం కట్టుకో'' అంటూ వేడుకుంది.

ఏకాంబరం పాపకు ఎన్ని నెలలు, ఎప్పటి నుంచి పాలు తాగడం లేదు మొదలగు వివరాలు అడుగుతూ రేకుపెట్టెలో మందుల కోసం వెదుకుతున్నాడు. ముసలామె సమాధానం చెబుతోంది. చివరకు ఓ పెట్టెలోంచి పొట్లాం ఒకటి తీసి పాలలో కలిసి పట్టమని చెప్పాడు. ముసలామె రూపాయి తీసి ఏకాంబరంకు ఇచ్చి వెళ్ళిపోయింది.

ఇంతలో మరో ఆసామివచ్చి ఏదో తలనొప్పికి టాబ్లెట్ అడిగి తీసికెళ్ళాడు.

ఐదు నిముషాల్లోపల ఇద్దరొచ్చి మందులు కొనుక్కెళ్ళటం చూసిన ఆ భారీ పెద్ద మనిషి గబగబా ఏకాంబరం దగ్గరకొచ్చాడు.

''మందులమ్ముతున్నావు. నీకు లైసెన్స్ వుందా?'' అంటూ సూటిగా ఘాటుగా అడిగాడు.

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పలేని ఏకాంబరం ఆ వచ్చిన పెద్దమనిషి ఎవరో తెలీక ఆశ్చర్యపోయాడు.

''నిన్నే మాట్లాడవేం?''

''లైసెన్స్ లేదండి''

''లైసెన్స్ లేకుండా నీ ఇష్టమొచ్చినట్లు మందులు అమ్ముతావా?'' అంటూ గట్టిగా మెడపట్టుకున్నాడు.

ఆ పట్టుకు ఏకాంబరం గిజగిజలాడిపోయాడు. కదల్లేకపోయాడు.

అప్పటికే ఆ బడ్డీదగ్గర పదిమంది పోగై వింతగా చూడసాగారు.

''ఎంతకాలం నుంచి అమ్ముతున్నావురా? లైసెన్స్ లేకుండా మందులమ్ముతూ ఎంతమంది ప్రాణాలు తియ్యాలని'' అంటూ వీపు మీద రెండు దెబ్బలు వేశాడు.

''తలనొప్పి, జ్వరానికే మందులు అమ్ముతున్నానండి. ఇవి తెచ్చుకోవాలంటే పాతికమైళ్ళు పట్నం వెళ్ళాలి.''

''అందుకని దొంగచాటుగా అమ్ముతున్నావ్ పద నిన్ను జైల్లోపెట్టి పది సంవత్సరాలు శిక్ష వేస్తేగానీ నీ రోగం కుదరదు'' అంటూ ఏకాంబరాన్ని బరబరా బయటకు ఈడ్చాడు.

నెమ్మదిగా జనం పోగయ్యారు. ఒక్కరు కూడా ఇది అన్యాయమని ప్రతిఘటించలేదు. ఏకాంబరం ప్రాణం మీదకొచ్చే మందులు అమ్మడం లేదని, జ్వరానికి, తలనొప్పికి మాత్రమే టాబ్లెట్లు అమ్ముతున్నాడని, వీటి వల్లే తమకు కాస్త ఊరటగా వుందని ఎవరూ ముందుకొచ్చి ఆ అధికారి ముందు చెప్పలేదు.

అప్పటికే ఏకాంబరం ఏదో తప్పు చేసినవాడిలా తలొంచుకున్నాడు. అతని కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

ఇంతలో జీపు డ్రైవర్ గబగబా ఏకాంబరం దగ్గరకొచ్చి నెమ్మదిగా ''అయ్యగారికి ఓ వెయ్యి రూపాయిలిచ్చుకో. కేసుండదు. పోలీస్టేషన్లో వుండవలసిన పని వుండదు'' అన్నాడు.

ఆ మాటలకు ఏకాంబరం ఛీత్కారంగా డ్రైవర్ కేసి చూశాడు. తానాశించిన సమాధానం రాకపోవడంతో డ్రైవర్ కోపంగా-''చూస్తారేమిటిసార్! వీడ్ని పోలీస్టేషన్లో అప్పచెబుదాం'' అన్నాడు.

అంతే!

ఆ అధికారి ఏకాంబరాన్ని ఈడ్చుకుంటూ జీపుదగ్గరకు తీసుకెళ్ళాడు. ఈలోపల డ్రైవర్ బడ్డీకొట్టులోవున్న మందులను, సామానునూ మూటకట్టి జీపులో పడేశాడు.

ఆ పల్లెజనం జరుగుతున్నదంతా చూస్తూండిపోయారు.

ఏకాంబరాన్ని ఎక్కించుకున్న జీపు కదిలింది.

కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా ఆ ఎండలో 'తూర్పుపాలెం' మసక మసగ్గా కన్పించసాగింది ఏకాంబరానికి!

★★★

ఏకాంబరం అందగాడు-కాదు.

ఏకాంబరం ధనవంతుడు-కాదు.

ఏకాంబరం రౌడీ-కాదు.

ఏకాంబరం కుటుంబం పెద్దది-కాదు.

ఏకాంబరం నేరస్తుడు-కాదు. అవును!

మరి, మీ దృష్టిలో?- ★